'కుట్టని' యంత్రాలు!



గత అసెంబ్లీ ఎన్నికల ముందు మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కుట్టు యంత్రాలను కేటాయించింది. ఎన్నికల హడావుడితో పాటు, పలు కారణాలతో పంపిణీ జరగలేదు. ఇప్పటికే ఆ కుట్టు యంత్రాలు పంపిణీకి నోచుకోక పలు చోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. దాదాపు ఏడాదిగా అర్హత గల మహిళలు ఎప్పుడు పంపిణీ చేస్తారా? అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి (భూపాలపల్లి జిల్లా)

కొనసాగుతున్న శిక్షణ శిబిరం

వెంకటాపూర్‌ : రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ శిబిరం కొనసాగుతోంది. గురువారం ఐదో రోజుకు చేరిన శిబిరంలో వాలంటీర్లు ఉదయాన్నే రామప్ప గార్డెన్‌లో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. లక్నవరం, మేడారం, ఏటూరునాగారం మండలంలోని చింతలమోరి గొత్తికోయ గూడేలను సందర్శించారు. గొత్తికోయలు సంప్రదాయ దుస్తువుల్లో నృత్యాలు చేశారు. మేడారం సమ్మక్క- సారలమ్మ చరిత్ర, లక్నవరం ప్రకృతి అందాలను చెరువు నిర్మాణ విశిష్టత గురించి ప్రొఫెసర్ పాండురంగారావు వివరించారు.

పోయిన ఫోన్.. చేజిక్కుతోంది..!



న్యూస్‌టుడే, చిట్యాల (భూపాలపల్లి జిల్లా)

సెల్‌ఫోన్.. మనిషి జీవన విధానంలో కాదు.. మనలోనూ ఓ భాగంగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు. వ్యక్తిగత, విద్య, విజ్ఞానం, ఆటలు, పాటలు, సినిమాలు, బ్యాంకుల సేవలు, డబ్బు చెల్లింపులు వంటి అనేక విషయాలు ప్రస్తుతం దీనితో ముడిపడి ఉన్నాయి. అది చోరీకి గురైనా.. లేదా మనమే పోగొట్టుకున్నా ఇక ఆశలు వదిలేసుకోవాల్సిందే అనేది ఒకప్పటి మాట. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ అందుబాటులోకి వచ్చాక సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొవడం సులభంగా మారింది. పోలీసులు ఈ పోర్టల్ ద్వారా ఫోన్లను కనుగొని బాధితులకు అప్పజెప్పుతున్నారు.

ఎక్కువగా పోతోంది ఇలా..

బాధితులు ఎక్కువగా ప్రయాణాల్లో సెల్‌ఫోన్‌లను పోగొట్టుకుంటున్నట్లు ఠాణాలకు వచ్చే ఫిర్యాదుల బట్టి అర్థం అవుతోంది. ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే తెలియకుండా పడిపోవడం, బస్సుల్లో, ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్తూ అందులోనే మరిచిపోవడం, తీర్థయాత్రలు, జాతరలు, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు చోరీకి గురికావడం వంటి కారణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇళ్ల వద్ద చోరీకి గురైన ఘటనలు ఉన్నాయి.

ఫిర్యాదు ఎలా చేయాలి..?

సెల్‌ఫోన్ పోయినప్పుడు బాధితులు వెంటనే అందులో ఉన్న సిమ్‌ను నెట్‌వర్క్ ఆపరేటర్ ద్వారా బ్లాక్ చేయించాలి. తరువాత అదే నంబర్‌పై కొత్త సిమ్ తీసుకోవాలి. ఈ నంబర్‌తో సిటిజన్ పోర్టల్‌లో లాగిన్ అయి ఫోన్ పోయినట్లుగా ఫిర్యాదు చేయవచ్చు. మీ సేవ ద్వారా ఐఎంఈఐ, ఫోన్ కొనుగోలు చేసిన రశీదుతో ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా పోలీసుస్టేషన్ వెళ్లి కూడా ఫిర్యాదు అందించవచ్చు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్‌ను పని చేయకుండా బ్లాక్ చేస్తారు. అందులో కొత్త సిమ్ వేసినప్పుడు గుర్తించి ఫోన్ ఎక్కడ ఎవరి దగ్గర ఉందో కనుగొంటారు. అక్కడి నుంచి ఠాణాకు తెప్పించి బాధితుడిని పిలిచి అన్‌బ్లాక్ చేసి అప్పగిస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు పోలీసుస్టేషన్‌లలో ఒకరు లేదా ఇద్దరు కానిస్టేబుళ్లను కేటాయిస్తున్నారు.



చిట్యాల ఠాణాలో బాధితులకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

దిగులు చెందకండి..

- మల్లేశ్, సీఐ, చిట్యాల



ఏదైనా కారణంతో సెల్‌ఫోన్ పోతే దిగులు పడాల్సిన అవసరం లేదు. మీ సేవ లేదా ఠాణాల్లో ఫిర్యాదు చేయవచ్చు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేసి పోగొట్టుకున్న ఫోన్ కనుగొని నేరుగా బాధితులకు అప్పగిస్తున్నాం. చిట్యాల సర్కిల్ పరిధిలో అందిన ఫిర్యాదుల్లో 79 శాతం ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించాం. ఇందుకోసం స్టేషన్లలో ప్రత్యేకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేశాం.

జిల్లాలో రికవరీ చేసిన సెల్‌ఫోన్ల వివరాలు..

● ఠాణా ● అందిన ఫిర్యాదులు ● రికవరీ చేసినవి

ఠాణా	చిట్యాల	టేకుమట్ల	మొగుళ్లపల్లి	రేగొండ	గణపురం	భూపాలపల్లి	కాటారం	కొయ్యూర్(మల్హర్)	మహాముత్తారం	మహదేవ్‌పూర్	కాళేశ్వరం	పలిమెల
అందిన ఫిర్యాదులు	70	187	52	116	43	320	121	88	23	42	39	21
రికవరీ చేసినవి	51	140	41	104	33	186	65	46	09	18	18	06

వాగు ఒడ్డున.. పూల సోయగం



ఈ చిత్రంలో కనిపిస్తోంది పూదోట కాదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట శివారు వంతెన సమీపంలోని చలివాగులో విచ్చుకున్న గడ్డిజాతి పూలు ఇవి.. చలివాగులో గడ్డి ఏపుగా పెరిగి తెల్లటి పువ్వులు విరబూశాయి. వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. -న్యూస్‌టుడే, టేకుమట్ల

కాళేశ్వరం అభివృద్ధికి త్వరితగతిన అంచనాలు



గోదావరి తీరం వద్ద పరిశీలిస్తున్న పాలనాధికారి రాహుల్‌శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరాన్ని ఆలయపరంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు త్వరితగతిన అంచనాలు పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా పాలనాధికారి రాహుల్‌శర్మ దిశానిర్దేశం చేశారు. ఆయన గురువారం కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి కాళేశ్వరం అభివృద్ధిపై ఈవో సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన సమావేశాల్లో చర్చించిన, అధ్యయనం చేసిన అంచనాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. 100 గదుల అతిథి గృహం, నిత్యాన్నదాన సత్రంతో పాటు మరికొన్ని పెండింగ్ నిర్మాణాల కోసం నిధులు మంజూరైనా టెండర్లను పిలవడంలో నిర్లక్ష్యం ఎందుకని పంచాయతీరాజ్‌శాఖ అధికారులను మందలించారు. గోదావరి తీరం వద్ద శాశ్వత ప్రాతిపదికన మహిళల దుస్తుల మార్పిడి గదులు, సులభ్ కాంప్లెక్సు నిర్మాణాలకు సంబంధించి స్థలాలను పరిశీలించారు. వచ్చే ఏడాది జరిగే సరస్వతీ పుష్కరాల కోసం భక్తుల వాహనాల నిలుపుదలకు ప్రైవేటు స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఆలయానికి సమీపంలోని ప్రాశస్త్యమైన గుండం చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అంతర్రాష్ట్ర వంతెన వద్ద విద్యుత్ దీపాలు అమర్చడానికి విద్యుత్ శాఖ ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. మురుగు కాల్వల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, ఆలయ ఈవో మారుతి, అధికారులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌లో సమావేశం : మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు దేవాదాయ, పర్యాటక శాఖతో పాటు ఇతర శాఖలతో సమావేశం కానున్నారు. జయశంకర్ జిల్లా పాలనాధికారితో పాటు పెద్దపల్లి జిల్లా పాలనాధికారి, పర్యాటకశాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొంటారని తెలిసింది.

అక్రమాలు దండి.. ఆదాయానికి గండి!

● యథేచ్ఛగా ఇసుక జీరో దందా..



ఇసుక లోడింగ్(ఫైల్ ఫోటో)

న్యూస్‌టుడే, మహదేవపూర్ (భూపాలపల్లి జిల్లా)

దట్టమైన అటవీ ప్రాంతం.. గోదావరి తీర ప్రాంతంలో పుష్కలమైన ఇసుక నిల్వలు. ఇంకేంటి.. అక్రమార్కులు యథేచ్ఛగా జీరో దందా కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి తీర ప్రాంతంలో ఇసుక నిల్వలతో ప్రాజెక్టుకు ఇబ్బంది కలుగుతోందని.. ఇసుక విక్రయాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇసుక క్వారీల నిర్వహణ జరుగుతోంది. భూపాలపల్లి జిల్లా పరిధిలో ప్రస్తుతం మహదేవపూర్, పలిమెల మండలాల్లో ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకొని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తూ.. ఇసుకను అక్రమంగా పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

తీరంలో అడ్డుకట్టేది...?

మహదేవపూర్, పలిమెల ప్రాంతాల నుంచి జీరో దందాతో ఇసుక లారీలు తరలివెళ్తున్నా అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయలేకపోతోంది. ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించకుండా, అనుమతి పొందకుండా ఇసుక లోడింగ్ చేసుకొని పట్టణాల్లో విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. జీరో దందా నడిపే ఇసుక లారీలు ఈ ప్రాంతం నుంచి తరలివెళ్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పలు క్వారీల నుంచి జీరో దందా ఇసుక లారీలు నిత్యం వెళ్తున్నాయని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ దందా సాగుతున్నా అధికారుల చర్యలు శూన్యం.

దందా చేస్తున్నారిలా..


☛ ఈ ప్రాంతం నుంచి ఇసుక లారీలు ప్రభుత్వానికి చెల్లించిన రుసుంతో ఇసుకను లోడింగ్ పూర్తి చేసుకొని ముందుగా వెళ్తాయి. ఆ లారీలతో పాటే జీరో దందా లారీలు సాగిపోతాయి. సాఫీగా వెళ్తే ఆ లారీలతో తరలిపోతాయి. ఒకవేళ ఎక్కడైనా తనిఖీలు, సమస్య ఎదురైతే అన్ని అనుమతులున్న లారీలు ముందుకు సాగిపోతాయి. ఏదైనా ఒక లారీ పట్టుబడితే మిగతా లారీల వారికి సమాచారం అందించడంతో జీరో దందా లారీలు ఎక్కడిక్కడే నిలిచిపోతాయి. తనిఖీలు పూర్తయిన తర్వాత జీరో ఇసుక లారీలు వేరే ప్రాంతాలకు వెళ్తాయి.

☛ ఇసుక క్వారీల వద్ద జీరో దందా లోడింగ్ గుట్టుగా జరుగుతోంది. పలుచోట్ల క్వారీలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉండి.. డంపింగ్ చేస్తున్న ప్రాంతాల నుంచి సైతం జీరో లోడింగ్ జరుగుతున్నట్లు సమాచారం. అక్రమ దందా వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అధికారులు 'మామూలు'గానే వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

☛ ఏదైనా చర్చనీయాంశంగా మారిన సందర్భాల్లో కంటి తుడుపు తనిఖీలు చేస్తున్నారని, అక్రమ దందా నియంత్రణకు పటిష్ఠంగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కాటారం డివిజన్ పరిధిలో అక్రమ రవాణా కేసులు

కాటారం	11
కొయ్యూర్	06
మహదేవపూర్	02



మహదేవపూర్ శివారులో ఇసుకను పారబోసి వెళ్లిన అక్రమార్కులు

తాజా ఘటనలు ఇలా..

● మహదేవపూర్ మండలంలో ఓ క్వారీ నుంచి ఎలాంటి పత్రాలు, రుసుం చెల్లించకుండా రెండు ఇసుక లారీలు తరలివెళ్తుండగా పోలీసులను చూసి ఓ ఇసుక లారీ డ్రైవర్ అక్కడే ఇసుక వదిలేసి వెళ్లాడు. మరో ఇసుక లారీకి సంబంధించి ఎలాంటి అనుమతులు లేవు. ● మహదేవపూర్ మండలంలోని ఓ క్వారీ నుంచి పలు ఇసుక లారీలు జీరో దందా పేరిట రాత్రి సమయంలో తరలివెళ్లాయి. కాటారంలో జీరో దందా లారీ ఒకటి పోలీసులకు పట్టుబడింది. పట్టుబడిన సమాచారం మిగతా అక్రమార్కులు చేరవేయడంతో మిగతా రెండు లారీల ఇసుకను మహదేవపూర్ శివారులోనే డంపింగ్ చేసి అక్కడి నుంచి అక్రమార్కులు, లారీలతో పారిపోయారు.

నిఘా పటిష్ఠం చేశాం..

- శ్రీరాములు, ప్రాజెక్టు అధికారి, టీజీఎండీసీ, మహదేవపూర్

ఈ ప్రాంతంలో నడుస్తున్న ఇసుక క్వారీల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. జీరో దందా ఎక్కడ జరిగినా మాకు సమాచారం అందిస్తే చట్టపరంగా చర్యలు చేపడుతాం. మా పరిధిలో నడుస్తున్న క్వారీల నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరగడం లేదు. ఈ ప్రాంతంలో పలు వాగుల నుంచి రవాణా జరుగుతున్నట్లు తెలిసింది.

అనిశాకు చిక్కిన పీఆర్ ఉద్యోగులు



నగదుతో పట్టుబడ్డ పీఆర్ ఈఈ దిలీప్, అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ దిలీప్‌తో పాటు అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి రూ. 20 వేల లంచం తీసుకుంటూ గురువారం అనిశాకు చిక్కారు. అనిశా డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్‌రావు మండలం తాడిచర్లకు చెందిన సదానందం అనే గుత్తేదారు 2023లో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి చేసిన పనులకు రూ.10 లక్షలకు గాను 5.23 లక్షలు మంజూరయ్యాయి. తర్వాత ఫైనల్ బిల్ రూ. 4.77 లక్షల మంజూరుకు పాస్ ఆర్డర్ ఇచ్చేందుకు పీఆర్ ఈఈ దిలీప్‌కు రూ. 10 వేలు, ఇద్దరు సిబ్బందికి రూ.5 వేల చొప్పున లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 రోజుల నుంచి ఇబ్బంది పెడుతుండగా విసిగి వేసారిన గుత్తేదారు వరంగల్ అనిశా అధికారులను ఆశ్రయించాడు. అనిశా అధికారుల సూచన మేరకు గురువారం సాయంత్రం 5:40 గంటల సమయంలో గుత్తేదారు కలెక్టరేట్‌లోని పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో అధికారులకు డబ్బులు ఇస్తుండగా వెంటనే పట్టుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని శుక్రవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌సుందర్, ఎల్. రాజు, ఎస్. రాజు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు.. నేడు దీపావళి బోనస్ చెల్లింపు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : సింగరేణి కార్మికులకు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రాఫిట్ లింకుడ్ రివార్డ్సు(పీఎల్‌ఆర్) దీపావళి బోనస్ సింగరేణి యాజమాన్యం చెల్లించనుంది. ఈ మేరకు గురువారం ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ దీపావళి బోనస్ చెల్లింపు గురించి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించినట్లు సంఘం భూపాలపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య తెలిపారు. ఈ మేరకు ఒక్కో సింగరేణి కార్మికుడికి రూ. 93,750 చొప్పున శుక్రవారం బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ బోనస్ పొందడానికి సంస్థలో 30 మస్టర్ల వరకు విధులు నిర్వర్తించిన వారు అర్హులు. అయితే భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు 190 మస్టర్లు, ఉపరితల విభాగంలో 240 మస్టర్లు నిండిన కార్మికులకు పూర్తిస్థాయిలో దీపావళి బోనస్ దక్కుతుంది. ఈ మేరకు తక్కువ మస్టర్లు ఉన్నవారికి మస్టర్ల ప్రాతిపదికనే చెల్లింపు జరుగుతుందని సంబంధిత సింగరేణి అధికారులు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో మొత్తం 5,423 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో సుమారు 4,900 మంది కార్మికులకు పీఎల్‌ఆర్ బోనస్ దాదాపు రూ. 42 కోట్ల వరకు చెల్లించనున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణివ్యాప్తంగా అన్ని ఏరియాల్లో పనిచేస్తున్న 40 వేల మంది కార్మికులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ. 388 కోట్ల వరకు బోనస్ జమ కానుంది. అదేవిధంగా గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన సింగరేణి వార్షిక లాభాల నుంచి ఇటీవల కార్మికులకు లాభాల బోనస్ పంపిణీ చేసిన విషయం తెలిసిందే..

పల్లెలు ప్రగతి సాధించడమే లక్ష్యం



ఇప్పలపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : పల్లెలు ప్రగతి సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని ఇప్పలపల్లి, మేదరమెట్ల గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పలపల్లి నుంచి పోతుగల్ గ్రామం మీదుగా కొర్కిశాల గ్రామం వరకు రూ. 3 కోట్ల 12 లక్షలు, మేదరమెట్ల గ్రామం నుంచి అంకుషాపూర్ వరకు రూ. కోటి 67లక్షల నిధులు బీటీ రోడ్ల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన వివరించారు. గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు తగిన నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మహమ్మద్ రఫీ, పీఏసీఎస్ ఛైర్మన్ సంపెల్లి నర్సింగరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కటంగూరి వెంకటరాం నర్సింహారెడ్డి, నాయకులు కుమారస్వామి, రాము, పున్నంచందర్‌రావు, లింగారావు, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మండల ప్రత్యేక అధికారులతో అభివృద్ధి పనులపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం 'ఫుడ్ విత్ చిల్డ్రన్' కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని చెప్పారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా..? లేదా అని పరిశీలించాలని.. ఎక్కడైనా లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో రహదారుల వెంట పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని, మొక్కల సంరక్షణకు ప్రతి శుక్రవారం నీరుపోసే కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పారు. ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టు తయారు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రవాణా సేవల్లో డీడీల హైరానా!

దళారులను ఆశ్రయిస్తేనే పని..

ఎనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన సూర్య టాటాఏస్ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇటీవల భూపాలపల్లి జిల్లాలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాన్ని విడిపించుకునేందుకు వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి రాగా రూ.7,225 జరిమానా విధించారు. ఈ మొత్తం డీడీ రూపంలో చెల్లించేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోవడంతో కార్యాలయం పరిసరాల్లోని దళారిని ఆశ్రయించాడు. ఒక డీడీలో ఈ మొత్తం లేక పోవడంతో రెండు డీడీలు ఇచ్చాడు. ఒక డీడీకి రూ.200 చొప్పున రూ.400 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దళారీ లేనిదే డీడీ పని కావడం లేదు. డీడీల బదులు అంతర్జాలంలో రుసుం చెల్లించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

రవాణాశాఖ కార్యాలయాల్లో డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా చెల్లింపులు చేయాలనే నిబంధన వాహనదారులకు ఇబ్బట్లు తెచ్చి పెడుతోంది. నగదు రహిత, ఆన్‌లైన్ సేవలకు అవకాశం ఉన్నా ఇప్పటికే కొన్ని ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. వీటిని అధిగమించాలంటే.. రవాణాశాఖ అంతర్గత సేవలు మెరుగుపరచాలి.



వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

ఇప్పటికే వాహనదారులు రుసుంలన్నీ మీసేవ, ఈ-సేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. ఇదే విధానం సైతం అంతర్జాలంలోనే అమలు చేస్తున్నారు. మరిన్ని రుసుంలు సైతం చరవాణి సాయంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లతో చెల్లించేలా చూడాలి. లేదంటే రవాణాశాఖ ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడి చరవాణికి ఎస్‌ఎంఎస్ పంపించేలా మార్పులు చేయాలి. కార్యాలయాల్లో దరఖాస్తు నంబరును నిక్షిప్తం చేసే స్కానర్ వస్సేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు.

బ్యాంకుల్లో తప్పని ఇక్కట్లు

వాహనదారులు రుసుంలు, చెల్లింపులు డీడీ రూపంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డీడీ కోసం బ్యాంకుల కోసం వెతకాల్సిన పరిస్థితి. బ్యాంకు వరకు వెళ్లి వాహనాదారులకు డీడీలు ఇవ్వమని నిబంధన పెట్టడంతో తలపట్టుకుంటున్నారు. గతంలో నేరుగా ఇచ్చేవారు. నూతన విధానంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు ఖాతాలు ఎలా ఉంటాయని వాపోతున్నారు.



ఆందోళన

చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

ఇదే అదనుగా దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు అవసరమైన డీడీలను దళారులు నిల్వ చేసి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నారు. పనులు తొందరగా ముగించుకోవాలనే దృక్పథంతో కార్యాలయాల పరిసరాల్లో ఉన్న దళారులను ఆశ్రయించడంతో చెప్పినంత అదనంగా చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. లేదంటే వచ్చిన పని మరో రోజుకు వాయిదా పడుతుంది. బ్యాంకర్లు కొత్త నిబంధనలతో దళారులకు పంట పండుతుంది.

సమయం వృథా..

వాహన పన్నులు, జరిమానాలు, ఇతర రాష్ట్రాల వాహనాల మార్పు, ఇతర కేసుల సమయంలో చేసిన సమయంలో చెల్లించాల్సిన రుసుంలన్నీ డీడీల రూపంలోనే కార్యాలయాల్లో తీసుకుంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో డీడీ నంబరు, బ్యాంకు పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వచ్చిన డీడీలను ప్రతిరోజు ఓ వ్యక్తి ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. దీంతే చాలా సమయం వృథా అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్లు, కార్యాలయానికి వచ్చే డీడీల సంఖ్య వివరాలు (సుమారుగా)

జిల్లా	రిజిస్ట్రేషన్లు	డీడీలు
హనుమకొండ	70	40
వరంగల్	60	30
జనగామ	40	25
మహబూబాబాద్	45	25
భూపాలపల్లి	30	20
ములుగు	30	20

రెండు నెలల్లో మార్పులు వస్తాయి

- పుప్పాల శ్రీనివాస్ రవాణాశాఖ ఉప కమిషనర్



రవాణాశాఖ కార్యాలయాల్లో మరో రెండు నెలల్లో సమగ్ర మార్పులు వస్తాయి. వాహనదారులు ఎదుర్కొంటున్న డీడీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. సాంకేతిక పరమైన మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రణాళిక చేస్తున్నారు. త్వరలోనే అమలు చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం..

వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని శాయంపేట హవేలీ, స్టేషన్ చింతలపల్లి గ్రామాల్లో కాకతీయ మెగా జౌళి వస్త్ర పరిశ్రమకు 2017 అక్టోబరు 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా 1350 ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు వ్యయం రూ.1150.47 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందులో మౌలిక సదుపాయాల కోసం రూ.706.87 కోట్లను ఖర్చు చేసింది. ప్రధానంగా భూసేకరణకు రూ.159.27 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 547 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది అంచనా.

కాకతీయకు కైటెక్స్ కళ!

పరకాల, గీసుకొండ, న్యూస్‌టుడే

● డిసెంబరులో వస్త్ర పరిశ్రమ ప్రారంభానికి సన్నాహాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న కాకతీయ మెగా జౌళి టెక్స్‌టైల్ పార్కులో త్వరలో మరో వస్త్ర పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. దుస్తుల తయారీ సంస్థలో పేరు పొందిన 'కైటెక్స్' పనులు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



కాకతీయ వస్త్రపరిశ్రమలో కైటెక్స్ కంపెనీ నెలకొల్పిన యూనిట్లు

ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు..

వస్త్రపరిశ్రమకు శంకుస్థాపన చేసి ఏడేళ్లలో ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు యూనిట్లను స్థాపించాయి. గణేషా ఎకోటెక్, యంగ్‌వన్‌తోపాటు కైటెక్స్ ముందుకొచ్చాయి.

● ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న గణేషా ఎకోటెక్ సంస్థ మొదటిసారిగా 50 ఎకరాల భూమిని తీసుకుని రూ. 500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లను ప్రారంభించింది. ఇక్కడ దేశంలోనే మొదటిసారిగా ప్లాస్టిక్ ఖాళీ సీసాలతో దారం తయారు చేసే పరిశ్రమను నెలకొల్పారు. దీని వల్ల 600 మంది ఉపాధి పొందుతున్నారు.

● దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ యంగ్‌వన్ సంస్థ క్రీడా దుస్తుల పరిశ్రమ నెలకొల్పడానికి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వస్త్రపరిశ్రమలో 297 ఎకరాల భూమిని తీసుకుంది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ప్రస్తుతం ఒక షెడ్డును ఏర్పాటు చేసి 70 మంది మహిళలకు కుట్టుపై శిక్షణ ఇస్తున్నారు. సూరత్, భీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వస్త్ర పరిశ్రమలో యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆనందం

చిన్న పిల్లల దుస్తుల తయారీ ఇక్కడే..

కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ సంస్థ చిన్నపిల్లల దుస్తుల తయారీ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పరిశ్రమ స్థాపనకు రూ.1200 కోట్లను వెచ్చిస్తోంది. అవసరమైన షెడ్లను నిర్మించి దుస్తుల తయారీకి కావాల్సిన యంత్రాలను అమరుస్తున్నారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఇది పూర్తయితే 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని చూస్తున్నారు. జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను సందర్శించగా ఇదే కైటెక్స్ కంపెనీలో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

సృజన వీచిక.. ఆవిష్కరణలకు వేదిక



భూపాలపల్లిలో తరగతి గదిలో విద్యార్థులు

న్యూస్‌టుడే, భూపాలపల్లి

ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యా శాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టాయి.. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం.. 2024-25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్సు అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా సైన్సు అధికారి బి. స్వామి తెలిపారు.

జనవరిలో విజేతల ప్రకటన : నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు. భూపాలపల్లి డీఈవో రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్‌ఎంలు, సైన్సు అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు.

అవకాశం

ఎవరికి అవకాశం..?: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 3,328 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 85కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 2.41 లక్షల మంది, ఇంటర్‌లో 12 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

'స్కిల్ డెవలప్‌మెంట్' సభ్యురాలిగా ఎంపీ కావ్య

రంగంపేట, న్యూస్‌టుడే: భారత పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఎంపికయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ కావ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!



వైద్యపరంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రిలో పలు వార్డుల్లో పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయో తెలియని పరిస్థితి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చినవారు ఇక్కడి పరిస్థితి చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వైద్య సేవల సంగతి పక్కన పెడితే.. వసతి, సౌకర్యాలు తీసికట్టుగా ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పెచ్చులూడి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు గోడలు చెమ్మతో మరింత బలహీన పడుతున్నాయి. గత వారం ఓ వార్డులో పెచ్చులూడి కిందపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



పురుషుల కొత్త(న్యూ మేల్) మెడికల్ వార్డు వద్ద



ఖైదీల వార్డుకి వెళ్లే దారిలో..



కిచెన్ కాంప్లెక్స్ మార్గంలో..



మహిళల మెడికల్ వార్డు వైపు..



ఆర్ఎంఓ కార్యాలయం వద్ద..

173 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ. 4.48 లక్షల విలువైన 173 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన బి.రఘు చుట్టపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్‌మిల్లులో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇచ్చింది. దీంతో తనిఖీ నిర్వహించి 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన జె.వేణు మారుతి మల్టీటెక్ రైస్ మిల్లులో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి 95 క్వింటాళ్లు, మడికొండ మండలం అమ్మవారిపేట శివారుల్లోని రాజేశ్‌కు చెందిన మహాలక్ష్మి కోళ్ల ఫారంలో 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

కిట్స్ విద్యార్థులకు రూ.14 లక్షల ప్యాకేజీ



ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఎస్ఈ విభాగానికి చెందిన ఆకాశ్ పున్నం, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న రాకేశ్ మామిడి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవల మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలను సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం కంపెనీ ప్రతినిధులు పంపిన నియామక పత్రాలను ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పురపాలికలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

జనగామ, న్యూస్‌టుడే: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పురపాలికలకు ఉపశమనం లభించనుంది. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్(బేసిక్) గ్రాంటు కింద నిధులను కేటాయించారు. నాన్‌మిలియన్ ప్లస్ పట్టణాల కేటగిరీలో 2023-24కు సంబంధించి రెండో విడత నిధులను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని వేతనాలు, నిర్వహణ ఖర్చులకు వినియోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య అవసరాల కోసం వస్తు సామగ్రి, వాహనాల కొనుగోలుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. గతంలో విడుదలైన నిధులు, వినియోగం తదితర అంశాలకు సంబంధించి వివరాలను సమర్పించాలి. ఉమ్మడి జిల్లాలోని వరంగల్ కార్పొరేషన్, 9 పురపాలికలకు మొత్తం రూ. 97863789 మంజూరయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివరాలు (రూ.లలో)

పురపాలిక	విడుదలైన నిధులు
వరంగల్(కా.)	70120849
జనగామ	4421374
భూపాలపల్లి	5247185
పరకాల	2301994
డోర్నకల్	1224600
మహబూబాబాద్	6062481
మరిపెడ	1544914
తొర్రూరు	2062493
నర్సంపేట	3266607
వర్ధన్నపేట	1611292

వైద్య విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి 'క్రితి' సదస్సు

● కేఎంసీలో రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, క్రితి సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డా.వేణుజి బత్తిని, జూనియర్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని ఎన్ఆర్ఐ భవనంలో కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) పేరిట కాకతీయ పరిశోధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ యూఎస్ఏ అల్యుమిని, 'క్రితి' సదస్సు కన్వీనర్ డా. సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి. బత్తిని తెలిపారు. గురువారం కేఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డితో కలసి వారు పరిశోధన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతో పాటు పరిశోధన వైపు మళ్లించడానికి రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దక్షిణ భారత దేశంలోనే అత్యధిక పారితోషికం రూ. 3 లక్షలతో పాటు పరిశోధనలో అభిరుచి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదిరకాల పోటీలు..: అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉద్దేశించిన 9రకాల పోటీలు ఇందులో ఉంటాయన్నారు. 350 మందికి పైగా విద్యార్థులు తుదిపోటీల్లో ప్రతిష్ఠాత్మక సత్కారాల కోసం పోటీపడతారన్నారు. రెండురోజుల పాటు సాగే కార్యక్రమంలో ఈ నెల 25న మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్‌క్విజ్), రెండోరోజు ఈ నెల 26న పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియం పోటీలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. కాళీప్రసాదరావు, ఏపీపీఐ అధ్యక్షుడు డా. సతీష్‌కతులా హాజరవుతారన్నారు. సమావేశంలో క్రితి కేఎంసీ విద్యార్థుల విభాగం ప్రతినిధులు డా. శశాంక్, రోహిత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

ఉత్సాహం విరిసె.. ప్రతిభ మెరిసె!

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో సన్‌వ్యాలీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని వెలిబుచ్చారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు సీహెచ్.మనోజ్ ఆదిత్యరెడ్డి, ఎన్.విగ్నేశ్వర్, ఎం.నిత్యకు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం.సురేష్, డైరెక్టర్ ఎం.సతీష్‌కుమార్ బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సన్ వ్యాలీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సురేష్, డైరెక్టర్ సతీష్ కుమార్

కాళేశ్వరాలయంలో సిబ్బంది కొరత

న్యూస్‌టుడే, కాళేశ్వరం(భూపాలపల్లి జిల్లా) : కాళేశ్వర దేవస్థానం సహాయక కమిషనర్ స్థాయికి ఎదిగినా ఇంకా ఆర్జేసీ పరిధి(6ఏ)లోనే కొనసాగుతోంది. అభివృద్ధిపరంగా ముందుకు సాగుతున్న కాళేశ్వర దేవస్థానం అంతేస్థాయిలో హోదా పెరగకపోవడం గమనార్హం.. రూ.5 కోట్లు ఆదాయం దాటినా ఎగువస్థాయికి వెళ్లడం లేదు. ఇప్పటికే అర్చకుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న క్షేత్రం త్వరలో సిబ్బంది లోటు రానుంది. ఆలయ నిర్వహణ అదుపుతప్పడంతో పలు విమర్శలకు లోనవుతోంది.. ఈ విషయంపై మంత్రి శ్రీధర్‌బాబు క్షేత్ర నిర్వహణపై ఆరా తీసినట్లు తెలిసింది. పూర్తి స్థాయి ఈవో కొనసాగాల్సి ఉండగా ఇన్‌ఛార్జి పాలన కొనసాగుతుంది. రెండేళ్ల క్రితం సీనియర్ సహాయకులు ఉమామహేశ్వర్ బదిలీపై కొండగట్టు వెళ్లారు. రెండు నెలల క్రితం జూనియర్ సహాయకుడు మహేశ్ రేగొండ మండలం కొడవటంచకు డిప్యుటేషన్‌పై వెళ్లి ఈవోగా భూపాలపల్లికి పదోన్నతిపై వచ్చాడు. ఆయన స్థానంలో కొడవటంచ జూనియర్ సహాయకులు రవికుమార్ కాళేశ్వరం రాగా, స్వల్ప వ్యవధిలోనే ఆయన తిరిగి కొడవటంచకు బదిలీపై వెళ్తున్నట్లు సమాచారం. పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న బుర్రి శ్రీనివాస్ కాళేశ్వర క్షేత్రం నుంచి బదిలీపై మేడారం వెళ్లేందుకు కమిషనర్ కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నట్లు తెలిసింది. ఒక వైపు మంత్రి శ్రీధర్‌బాబు సూచన మేరకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి పలు సమీక్షలు నిర్వహిస్తుంటే ఇక్కడ నుంచి ఒక్కొక్కరుగా బదిలీకి ప్రయత్నాలు జరిగినా.. వారి స్థానంలో ఇతర ఆలయాల నుంచి కాళేశ్వర క్షేత్రానికి పలువురు ఉద్యోగులు రావాల్సి ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కాళేశ్వరం ఆలయం

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

వేములవాడకు బస్ సౌకర్యం కల్పించాలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : పారిశ్రామిక కేంద్రమైన భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి వేములవాడకు బస్ సర్వీస్ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని భూపాలపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు జోగుల సరోజన సమ్మయ్య తెలిపారు. గురువారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడారు.. భూపాలపల్లి కేంద్రం నుంచి నిత్యం వేములవాడకు వందల సంఖ్యలో భక్తులు ప్రయాణిస్తారని, దాదాపు లక్ష మంది జనాభా ఉన్న భూపాలపల్లి పట్టణం నుంచి కనీసం బస్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు. భూపాలపల్లి నుంచి చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల మీదుగా హుజూరాబాద్ నుంచి వేములవాడకు బస్ సర్వీస్‌ను నడిపిస్తే ఈ రూట్‌లో అనేక గ్రామాల ప్రయాణికులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జీఎస్సార్, కలెక్టర్ చొరవ తీసుకుని భూపాలపల్లి నుంచి వేములవాడకు బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక



భీమనాథుని సత్యనారాయణ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన భీమనాథుని సత్యనారాయణ ఎంపిక చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన సత్యనారాయణకు రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సత్యనారాయణను ములుగు జిల్లా ఇన్‌ఛార్జిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పద్మశాలీ జాతి చైతన్యం కోసం, చేనేత పరిశ్రమ పరిరక్షణకు నిరంతరం కృషి చేయనున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

సూచికలు తుప్పల్లో.. ప్రాణాలు గాల్లో..



నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే కాటారం-మేడారం ప్రధాన రహదారి ఇప్పటికే పలుచోట్ల భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. మరోవైపు మూలమలుపులు, లోలెవల్ వంతెనలు ఉన్నట్లు సూచించే సూచిక బోర్డులు చెట్ల మధ్య కూరుకుపోయాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సూచిక బోర్డులు కనిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

నిర్లక్ష్యం అల్లుకుంది



మహాముత్తారం మండలంలోని కొర్లకుంట ప్రధాన కూడలి సమీపంలో విద్యుత్ స్తంభానికి తీగజాతి మొక్క అల్లుకుపోగా విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో ఒక్కోసారి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. మరో వైపు పశువులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉంది.

-న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

పోరాట యోధుడు.. సాయిబాబా



సంతాప సభలో నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ప్రజా హక్కుల సాధనకు పోరాడిన గొప్ప వ్యక్తి సాయిబాబా అని.. నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి బదావత్ రాజు కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి ప్రాంతంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ కర్నాటక సమ్మయ్య అధ్యక్షతన మానవ హక్కుల నేత, దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మానవ హక్కుల వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి బదావత్ రాజు మాట్లాడుతూ.. ప్రజా సంఘాలు, భావ ప్రకటన స్వేచ్ఛను పూర్తిగా అణచివేయాలనే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలవుతున్నాయని ఆరోపించారు. సాయిబాబాను కొన్నేళ్ల పాటు జైలు పాలు చేసి, చిత్రహింసలకు గురిచేయడం వల్లనే ఆయన మరణం జరిగిందని ఆరోపించారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామేర గట్టయ్య మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన గొప్ప విప్లవకారుడు సాయిబాబా అని కొనియాడారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా నాయకులు ఎస్.వీరన్న సేవానాయక్, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మణ్, శంకర్, యుగేందర్, పార్వతి, నర్సయ్య, లక్ష్మీనారాయణ, భద్రయ్య పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మక విద్యను ఉపాధ్యాయులు అందించాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సామల రమేష్, ఉమ్మడి పరీక్షల బోర్డు జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు భద్రయ్య కోరారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ జంగేడు, శ్రీచైతన్య హైస్కూల్, ప్రభుత్వ మైనార్టీ గురుకుల విద్యాలయంలో ఎస్ఏ-1 పరీక్ష రాస్తున్న విద్యార్థులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలని, ప్రశాంతంగా పరీక్ష రాస్తే ఎక్కువ మార్కులు సాధిస్తారని పేర్కొన్నారు. నవంబరు 2న జవాబు పత్రాల మూల్యాంకం చేయాలని, అదే నెల 5న ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేయాలని సూచించారు. వారి వెంట జంగేడు పాఠశాల హెచ్ఎం అశోక్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

నిత్య గీతాలాపన అభినందనీయం



గీతాలాపన కార్యక్రమంలో సీఐ, ఎస్సై

చెల్పూర్, న్యూస్‌టుడే : నిత్య గీతాలాపన ద్వారా దేశభక్తి పెరుగుతుందని చిట్యాల సీఐ మల్లేశ్ అన్నారు. గురువారం గణపురం మండలం చెల్పూర్‌లో శ్రీనివాస వర్తకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య గీతాలాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. దేశభక్తిని చాటేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఎంజీఎం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, మాజీ ఎంపీపీ కావటి రజిత రవీందర్, మాజీ సర్పంచి మధుసూదన్‌రావు, పద్మా వెంకన్న పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



భీమ్‌గణపూర్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే జీఎస్సార్

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండలం పంబాపూర్‌లోని భీమ్‌గణపూర్ చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి వంద శాతం ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 50 వేల చేప పిల్లలను వదిలామని.. వారం రోజుల్లో మరో 6 లక్షల చేప పిల్లలను వదులుతామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చెరువులన్నీ అన్యాక్రాంతమయ్యాయని చెరువులను కాపాడుకోకుంటే భవిష్యత్తు తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఖదీర్ అహ్మద్, జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాశ్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు సౌకర్యాలు

భూపాలపల్లి కలెక్టరేట్ : వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండో సంవత్సరం వైద్య విద్యార్థులు జనరల్ ఆసుపత్రిలో వైద్యాధికారుల పర్యవేక్షణలో రోగులకు అందించే చికిత్స విధానంపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అడవిలో దారి తప్పిన యువకుడు.. కాపాడిన పోలీసులు



బయటకు తీసుకొచ్చిన యువకుడితో పోలీసులు, గ్రామస్థులు

మల్హర్, న్యూస్‌టుడే : అటవీ ప్రాంతంలో దారితప్పిపోయిన యువకుడిని పోలీసులు రక్షించారు. దాదాపు రెండు గంటలు శ్రమించి ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. ఖమ్మంకు చెందిన జస్వ అనే యువకుడు ద్విచక్రవాహనంపై పని నిమిత్తం మంచిర్యాల వెళ్లి బుధవారం తిరుగు పయనమయ్యారు. మల్హర్ మండలం కిషన్‌రావుపల్లి నుంచి అడవిలోని కాలిబాట ద్వారా భూపాలపల్లి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కిషన్‌రావుపల్లికి చేరుకోగానే చీకటిపడింది. గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తుండగా.. రాత్రి 11.30 గంటల సమయంలో అడవిలో దారితప్పిపోయాడు. ద్విచక్రవాహనం చెడిపోయింది. చిమ్మచీకట్లో ఎటూవెళ్లలేని పరిస్థితి. దీంతో భయాందోళనకు గురై 100 నెంబర్‌కు ఫోన్ చేశారు. స్పందించిన కొయ్యూర్ ఎస్సై నరేష్ భయపడొద్దని ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పారు. గ్రామస్థుల సహకారంతో దాదాపు రెండు గంటల పాటు అడవిలో వెతికారు. ప్రాణ భయంతో ఉన్న జస్వను ఎట్టకేలకు బయటకు తీసుకురావడంతో ఉత్కంఠ వీడింది. చెడిపోయిన ద్విచక్రవాహనానికి మరమ్మతు చేయించి ఎస్సై సురక్షితంగా ఇంటికి పంపించారు. ఎస్సై నరేష్, కానిస్టేబుల్ రమేష్, ఇతర పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు, గ్రామస్థులు అభినందించారు.

భూముల హద్దులు చూపాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

చిట్యాల, న్యూస్‌టుడే : మండలంలోని కైలాపూర్ శివారులో 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం తమకు అందించిన భూములకు సరిహద్దులు నిర్ణయించాలని కోరుతూ మండల కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన దళిత రైతులు తహసీల్దార్ హేమకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత ఆగస్టు 30న హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజావాణికి వెళ్లి తాము దరఖాస్తు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వేయర్‌లతో సర్వే చేయించి హద్దు చూపుతామని జిల్లా అధికారులు చెప్పినట్లు వివరించారు. తొందరగా సర్వే నిర్వహించేలా తహసీల్దార్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నర్సింహరాములు, మొగిలి, సాంబయ్య, కుమార్, అంకూస్, నర్సయ్య, లక్ష్మయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కబడ్డీలో ప్రతిభ



విద్యార్థిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మహదేవపూర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్(సీఏ)లో ప్రథమ సంవత్సరం చదువుతున్న పుట్టల విష్ణువర్ధన్ కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి, తమిళనాడులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈనెల 29 నుంచి జరిగే పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు రాజు, శ్రీనివాస్, మాధవి, రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

హుండీల నగదు లెక్కింపు వాయిదా

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరం దేవస్థానం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల హుండీల నగదు లెక్కింపు ఈ నెల 28కు వాయిదా వేసినట్లు ఈవో మారుతి తెలిపారు. శుక్రవారం హుండీల నగదు లెక్కించాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



మానేరువాగు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల, న్యూస్‌టుడే : చిట్యాల, టేకుమట్ల పరిధిలోని మానేరు వాగు నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. గురువారం ఆయా మండలాల్లోని కాల్వపల్లి, కలికోట గ్రామాల శివారులోని మానేరు వాగును ఆయన తహసీల్దార్ హేమతో కలిసి సందర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థానిక అవసరాలకు ఇసుక వాడుకోవాలని సూచించారు. అక్రమంగా లాభార్జనే ధ్యేయంగా ఇసుక వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక తరలించే వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్, ధ్రువీకరణ పత్రాలు, బీమా, డ్రైవర్లకు లైసెన్స్‌లు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణ్‌కుమార్, గిర్దావర్ రాజు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు యజమానులతో సమావేశం

భూపాలపల్లి : భూపాలపల్లి పోలీసు స్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని అన్ని పెట్రోల్ బంక్ యజమానులతో స్థానిక డీఎస్పీ సంపత్‌రావు సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత గురించి, డీఎస్పీ అవగాహన కల్పించారు. అన్ని పెట్రోల్ బంక్‌ల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఉన్నాయని, సమీప కాలనీల్లో ఏర్పాటు చేయటానికి సహకరిస్తామని యజమానులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్ యాదవ్, స్థానిక ఎస్సై సుధాకర్, తదితర పెట్రోల్ బంకుల యజమానులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయండి

చిట్యాల, న్యూస్‌టుడే : వరంగల్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా సీనియర్ నాయకులు నోముల శ్రీనివాస్, మేకల రమేశ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మండల ఇన్‌ఛార్జి నేరెళ్ల ఓదెలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో ఎస్సీ వర్గీకరణను మొదటగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట మీద నిలబడలేదని తెలిపారు. మహాసభకు మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంబాల అనిల్‌కుమార్, నరేశ్, మహేశ్, రాకేశ్, రాజు, సందీప్, హరీశ్, ప్రభు పాల్గొన్నారు.


రేగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి ఇప్పటివరకు చేయకుండా విస్మరిస్తోందని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సంపత్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సంపత్, జిల్లా నేత శ్రీనివాస్ మాట్లాడుతూ.. 26న వరంగల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్మయుద్ధ మహాసభ నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. జిల్లా, మండల నేతలు రమేశ్, అనిల్, కుమార్, విజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే అధికారికి సన్మానం



భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందనున్న కొత్తగూడెం డివిజన్‌కు చెందిన చీఫ్ సర్వే ఆఫీసర్ జైనుల్లోద్దిన్‌ను గురువారం సాయంత్రం స్థానిక జీఎం హబీబ్ హుస్సేన్‌తో పాటు అధికారులు కలిసి ఘనంగా సత్కరించారు. సింగరేణివ్యాప్తంగా చీఫ్ సర్వే అధికారి చేసిన భూసేకరణ పనుల కోసం చేసిన సేవలను జీఎం కొనియాడారు. పదవీ విరమణ పొందిన తర్వాత జైనుల్లోద్దిన్ తన కుటుంబసభ్యులతో ప్రశాంతంగా, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని జీఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, వెంకటరాంరెడ్డి, వెంకటరమణ, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి, అన్ని గనుల మేనేజర్లు, సంక్షేమ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



మహదేవపూర్, న్యూస్‌టుడే : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో అడుగులు వేయాలని, సమయాన్ని వృథా చేయకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా నోడల్ అధికారి వెంకన్న పేర్కొన్నారు. మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాలలకు తప్పకుండా హాజరుకావాలని, పరీక్షలకు సన్నద్ధమవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నర్సయ్య, అధ్యాపకులు అబ్దుల్ ఘని, ప్రసాద్, సమ్మయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సీసీ కెమెరాలపై అవగాహన



కాటారం, న్యూస్‌టుడే : మండలంలోని గుమ్మళ్లపల్లి గ్రామంలో కాటారం ఎస్సై అభినవ్ ప్రజలకు నిఘా నేత్రాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు నేరస్థులను పట్టుకోవడంలో, నేరాలను అదుపు చేయడానికి ఎంతో అవసరమన్నారు. స్థానికులు సహకరిస్తే గ్రామ కూడలి వద్ద, ప్రధాన రహదారులపై కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

చిద్నెపల్లి పాఠశాల పరిశీలన



కాటారం, న్యూస్‌టుడే : మండలంలోని చిద్నెపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సందర్శించారు. కొన్ని రోజుల క్రితం పాత బడి భవనం పైకప్పును నిబంధనలు పాటించకుండా కూల్చివేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్, పలువురు గ్రామస్థులు కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ పాఠశాలను సందర్శించి ఎంపీడీవో బాబు, ఎంఈవో శ్రీదేవి, చింతకాని పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం శైలజ, ఎంపీవో వీరస్వామితో మాట్లాడారు. పాఠశాల పాత భవనాన్ని ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలన చేసి, భవనం స్థితిగతులు, కూల్చివేతకు సంబంధించిన పూర్వాపరాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి శంకరయ్య పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

మహాముత్తారం, న్యూస్‌టుడే : మండలంలోని స్తంభంపల్లి(పి.పి) గ్రామానికి చెందిన సోదరులు సూడిది రంజిత్, ప్రవీణ్ ఇటీవల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఇరువురికి ఆపరేషన్ నిమిత్తం పెద్ద ఎత్తున ఖర్చవుతుండటంతో విషయం మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయ నిది ద్వారా చెరో రూ.1.25 లక్షల చొప్పున ఇరువురికి కలిపి రూ.2.50లక్షల విలువైన ఎల్‌వోసీలను మంజూరు చేయించి ఆసుపత్రి సహాయకుల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు



స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

పలిమెల, న్యూస్‌టుడే : పలిమెల గ్రామ శివారులో గ్రామకంఠం సంబంధించిన 13.31 గుంటల ప్రభుత్వ భూమిని వివిధ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించారు. స్థానికులు ఈ స్థలంలో కొంత ఆక్రమించేందుకు ప్రయత్నం చేసి సిమెంటు స్తంభాలు వేశారు. ఈ విషయంపై పలిమెల తహసీల్దార్ సయ్యద్ సర్వర్ స్పందించి స్తంభాలను తొలగించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మించినా, స్థలాన్ని ఆక్రమించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చిట్యాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని శివాని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోల్కొండ భిక్షపతి తెలిపారు. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన పోటీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా తరఫున ఉత్తమ ప్రతిభ కనబర్చి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 28న పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ మేరకు విద్యార్థినిని, పీఈటీలు శారద, వెన్నెలను ఆయన, డీఈవో రాజేందర్, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి రమేశ్ అభినందించారు.

ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నిక



వెంకటస్వామి

రేగొండ, న్యూస్‌టుడే : రేగొండ మండలం తిర్మలగిరి గ్రామంలోని బుగులోనివెంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా రొంటాల వెంకటస్వామి ఎన్నికైనట్లు ఈవో శ్రీనివాస్ గురువారం తెలిపారు. ధర్మకర్తలుగా వెంకటేశ్వర్లు, పాపారావు, జితేందర్, అనిత, భిక్షపతి, భాస్కర్, శివ,రాజేందర్ ఎన్నికైనట్లు ఈవో చెప్పారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 14 నుంచి 18 వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాదాయశాఖ అధికారులు ఉత్సవ కమిటీని ఎంపిక చేసినట్లు ఈవో తెలిపారు.